ప్రజాశక్తి
ఆదివారం 23 ఏప్రిల్ 2023 5 విజయనగరం



నేడు మంత్రి బొత్స సత్యనారాయణ రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం జిల్లాకు రానున్నారు. విశాఖ నుంచి నగరంలోని తన నివాసానికి రాత్రికి చేరుకుంటారు. 24న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో మే 3న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించనున్నారు. 11 గంటలకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పనులపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం జిల్లా రాపాక చేరుకొని మడ్డువలస ప్రాజెక్టు రెండోదశ పనులకు శంకుస్థాపన చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. 25న ఉదయం 10 గంటలకు చీపురుపల్లి మండలం కర్లాం చేరుకొని గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ అదనపు భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ బహిరంగసభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు గుర్ల మండలం జమ్ములో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించి అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు.

పలుచోట్ల వర్షం

బొజ్జిలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

జిల్లాలో పలుచోట్ల శనివారం సాయంత్రం వర్షం పడింది. వేపాడ, కొత్తవలస, శృంగవరపుకోట, జామి, లక్కవరపుకోట, పూసపాటిరేగ, తదితర మండలాల్లో వర్షం కురిసింది. ఎస్.కోటలో పిడుగు పడి ఇటుకల బట్టీలో పనిచేస్తున్న కూలీ మృతి చెందాడు. సాయంత్రం 4గంటల నుంచి ఈదురు గాలులతో వర్షం కురవడంతో ప్రజలంతా ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం వడగళ్లతో వర్షం కురిసింది. దీంతో మామిడి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గాలులు వీయడంతో మామిడి కాయలు నేల రాలాయి. ఎస్.కోటలో సుమారు గంటపాటు వర్షం కురిసింది. ఉష్ణోగ్రత వేడి నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు చిన్నారులు వర్షంలో తుడుస్తూ కేరింతలు కొట్టారు. తొలకరి దుక్కు దున్నేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు.

పిడుగుపాటుకు కూలీ మృతి

శృంగవరపుకోట : ఎప్పటిలాగే భార్యభర్తలు ఇద్దరు కలిసి ఇటుకల బట్టీలో పనిచేసేందుకు వెళ్లారు. అయితే వీరిలో భర్తపై ఆకస్మాత్తుగా అగ్గిపిడుగు పడటంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. భార్య తమ వెంట తెచ్చుకున్న వాటర్ బాటిల్ ను పక్కన పెట్టేందుకు వెళ్లడంతో తటిలో మృత్యువు నుంచి తప్పించుకుంది. ఈ సంఘటన ఎస్.కోట మండలంలోని కొట్టాం జంక్షన్ సమీపంలోని మామిడిపల్లి గ్రామ పెద్ద చెట్టిపోలు రమణ ఇటుకల బట్టీ వద్ద శనివారం నాలుగు గంటల సమయంలో చోటుచేసుకుంది. మామిడిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బొంగరాల అప్పారావు(45) తన భార్య లక్ష్మణ ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట పనికి వెళ్తారు. శనివారం కొట్టాం జంక్షన్లో వున్న ఇటుకల బట్టీకి పనికి వెళ్లారు. ఉదయమంతా పనిచేసి రెండు గంటల సమయంలో భార్యభర్తలు ఇద్దరు కలిసి బోజనం చేశారు. కాసేపు విశ్రాంతి తీసుకుని మూడుగంటల సమయంలో మరోసారి పని మొదలు పెట్టారు. ఈసమయంలో వర్షం మొదలుకావడంతో పాటు ఉరుములు వచ్చాయి. ఆ సమయంలో లక్ష్మణ తమతో తెచ్చుకున్న వాటర్ బాటిల్ తడిసిపోతుండటంతో పక్కన పెట్టేందుకు వెళ్లింది. ఆమె వెళ్లిన క్షణాల వ్యవధిలోనే తన భర్త అప్పారావుపై పెద్దఎత్తున పిడుగు పడి సంఘటన స్థలంలో శరీరం కాలిపోయి చనిపోవడం చూసి మూర్ఛపోయింది. గమనించిన చుట్టుపక్కల వారు సంఘటన స్థలానికి చేరుకొని అప్పారావును చూడగా అప్పటికే చనిపోయాడు. అతని భార్యకు సపర్యలు చేసి తేరుకునేలా చేశారు. ఎప్పుడూ భార్యభర్తలు ఎంతో అన్యోన్యంగా ఉండేవారని, పిడుగు వారి కుటుంబంలో విషాదం నింపిందని ఆవేదన చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, వృద్ధురాలైన తల్లి ఉన్నారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్పారావు మృతదేహాన్ని తరలిస్తున్న గ్రామస్తులు, ఇన్‌సెట్‌లో అప్పారావు (ఫైల్)

ఫ్లైఓవర్ పూర్తయ్యేనా?

- అసంపూర్తిగా నిర్మాణ పనులు
- గుంతల్లో నిలిచిపోతున్న వాహనాలు
- మునుపెన్నడూ లేని విధంగా ట్రాఫిక్ జామ్!
- ఎండ వేడిమి తట్టుకోలేక ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు

జిల్లాలో పదేళ్లుగా పూర్తికాని ఫ్లైఓవర్‌గా పెదమానాపురం ఆర్‌ఒబి నిలిచిపోయింది. జిల్లా వాసుల్లో ప్రతి నోటా ఇదే మాట. ఫలితంగా అటు వాహనదారులు, ఇటు ప్రయాణికులు, మరోవైపు స్థానికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అసంపూర్తి నిర్మాణ పనులతో అవస్థలు పడుతున్నారు. జిల్లాలో ప్రధానమార్గం ఇదే కావడంతో వేలాది వాహనాలు సాగిస్తుండటంతో నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో నానాపాట్లు పాడుతున్నారు. నిర్మాణ పనులు ఎక్కడివక్కడ వదిలేయడంతో రోడ్డంతా గుంతలమయమై వాహనాలు నిలిచిపోతున్నాయి.

అర్ధాంతరంగా నిలిచిన బ్రిడ్జి ఇదే

ప్రజాశక్తి-దత్తిరాజేరు

విజయనగరం నుంచి గజపతినగరం, రామభద్రపురం, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా రాయగడ, ఇటు సాలూరు, సుంఖి మీదుగా ఒడిశా వెళ్లే జాతీయ రహదారి ఇది. అందుకే నిత్యం వందల కొద్ది వాహనాలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అంతటి ప్రధానమైన 26వ నంబర్ జాతీయ రహదారిలో పెదమానాపురం వద్దనున్న రైల్వేగేటుతో నిత్యం వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని 2013వ సంవత్సరంలో ఫ్లైఓవర్ పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు పదేళ్లు గడుస్తున్నా ఆర్‌ఒబి నిర్మాణం పూర్తి కాలేదు. పర్యావసానం ప్రయాణికులు, వాహన దారులు, స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గతేడాది జనవరిలో రోడ్డు విస్తరణ కోసం నిర్వాసితులకు పరిహారం అందజేసి, ఖాళీ చేయించి చకచకా పనులు ప్రారంభమైనప్పటికీ మూడు అడుగుల ముందుకే వేస్తే ఆరడుగుల వెనక్కి అన్న చందంగా పనులు చేపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కాలువలు పూర్తిచేసి, డైవర్షన్ రోడ్లు వేసేందుకు పనులు చేపట్టి అర్ధాంతరంగా నిలిపేశారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డు కావడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డైవర్షన్ రోడ్డులో పెద్దగొయ్యి ఏర్పడటంతో నిత్యం వాహనాలు ఎప్పటికప్పుడు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురౌతున్నారు.

రోడ్డు నిర్మాణం కోసం వేసిన మట్టి

అందరికీ పాట్లే

మానాపురం గేటు పడితే వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాల్సి వస్తోంది. ఒక్కోసారి రెండు, మూడు రైళ్లు వెళ్లే వరకూ గేటు తీసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో తీవ్ర ఎండ ప్రభావంతో వేడిని తట్టుకోలేక వాహనదారులు, బస్సులో వృద్ధులు, చిన్నారులుతో ప్రయాణించేవారు తీవ్ర ఆందోళనకు చెందుతున్నారు.. పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రోడ్డుపై దుమ్ము, ధూళితో స్థానికులు కూడా తీవ్ర అవస్థలు ఎదుర్కొంటు న్నారు. మరోవైపు ప్రతి పది నిమిషాలకు రైల్వే గేట్ పడటంతో స్థానిక పోలీసులు ఎండలోనే ఉండి ట్రాఫిక్ మళ్లించేందుకు చర్యలు చేపట్టాల్సి వస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణం నిత్యం నరకప్రాయంగా ఉందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఫ్లైఓవర్ పనులు చేపట్టేలా చర్యలు చేపట్టి, ప్రయాణికుల కష్టాలకు విముక్తి కల్పించాలని పలువురు విన్నవించు కుంటున్నారు.

ఈత కొలను ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్ ఆధునిక వసతులతో తాజాగా మళ్లీ స్విమ్మర్లకు ఆహ్వానం పలుకుతోంది. మరమ్మతులు, ఆధునీకరణ పనుల కోసం ఈ స్విమ్మింగ్ పూలను గత కొంతకాలంగా మూసివేశారు. దీని నిర్వహణ బాధ్యతలను ప్రయివేటు సంస్థకు అప్పగించిన తర్వాత ఆ సంస్థ రూ.28 లక్షలతో దీనిని ఆధునీకరించి మరిన్ని వసతులతో సిద్ధం చేసింది. వేసవిలో స్విమ్మింగ్ నేర్చుకునేందుకు ఆసక్తి కనబరిచే బాలబాలికలు ఇతరులకు, సాధన చేసేవారికి ఈతకొలను అందుబాటులోకి వచ్చింది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ఆధునీకరించిన ఈతకొలనును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాలతోపాటు క్రీడారంగాన్ని కూడా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఉన్నారని, అందులో భాగంగానే అక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రభుత్వ సహాయ సహకారాలతో నగరంలోని అన్ని స్టేడియంలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ లలో వసతుల కల్పనకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ఎందరో స్విమ్మర్లను తీర్చిదిద్దేందుకు ఈ అక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ దోహదపడగలదని ఆకాంక్షను వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, విఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిజిఇఎ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.రామచంద్రరావు, కంది వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎస్ రద్దు చేయాలని, డిఎలు విడుదల చేయాలని, పిఆర్‌సి ఒప్పందాలు అమలు చేయాలని, 1వ తేదీనే జీతాలు చెల్లించేలా చట్టం చేయాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ న్యాయపరమైన ఇబ్బందులు తొలగించడానికి కృషి చేయాలని, కార్యదర్శుల గ్రేడ్లు 6 స్థానంలో, 2 లేక మూడుకు కుదించాలని, పెన్షనర్ల, కంటింజెంట్, కాంట్రాక్టు, ఆర్‌టిసి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా పరిష్కారం కావడం లేదన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 30న రాజమండ్రిలో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వి యుగంధర్ అసోయేషన్ నాయకులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో మహిళకు రక్షణ కరువు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు రక్షణ కరువైందని, తొమ్మిదేళ్లయినా 33శాతం రిజర్వేషన్ అమలు చేయడం లేదని సిపిఎం జిల్లా నాయకులు పి.రమణమ్మ అన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారంలో భాగంగా శనివారం అయ్యన్న పేటలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రకు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయలేదని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మేస్తున్న ఆంధ్ర ద్రోహి మోడీ గద్దె దిగాలని డిమాండ్ చేశారు. మోడీని గద్దె దించి, దేశాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన గంటస్తంభం, సిటీ బస్టాండ్, న్యూపూర్ణ జంక్షన్, రాజీవ్ స్టేడియం ప్రాంతాల్లో ప్రచార భేరి నిర్వహించారు. గ్రామాల నుంచి కాయగూరలు తెచ్చి అమ్ముకుంటున్న రైతులను, తోపుడు బళ్ళ చిరు వ్యాపారులను, స్టేడియంలో క్రీడాకారులను, వాకర్స్ ను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. మోడీ చేస్తున్న దుర్మార్గపు విధానాలను వారికి వివరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, సిపిఐ నాయకులు అశోక్, రంగరాజు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి, బాడంగి : మోడీ విధానాలతో కార్పొరేట్ సంస్థలకు లాభమని సిపిఎం, సిపిఐ జిల్లా నాయకులు పి.శంకరరావు, కోట అప్పన్న అన్నారు. ప్రచారభేరిలో భాగంగా మోడీ విధానాలకు వ్యతిరేకంగా బొబ్బిలి, బాడంగి మండలాల్లో ఆటో ప్రచారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ విధానాలతో కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూరి, ప్రజలకు నష్టం కలగుతోందని చెప్పారు. మోడీ విధానాలను

విజయనగరంటౌన్.. ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు రమణమ్మ

వ్యతిరేకించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు ఎస్.గోపాలం, బలస శ్రీను, సురేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వంగర : దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతీ పౌరుడు గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని, సిపిఎం, సిపిఐ జిల్లా నాయకులు కె. సురేష్, ఎన్ నాగభూషణం అన్నారు. మండలంలోని శనివారం ఎంఎస్‌ఆర్ పురం, వంగర, మద్ది వలస, తలగాం, శివ్వాం తదితర గ్రామాలలో ప్రచార బేరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు పి. విశ్వనాథం, ఎం, త్రినాథ్, వి.తిరుపతిరావు, సుమన్, రమేష్ పాల్గొన్నారు.

దెంకాడ : మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో

ప్రచారభేరిలో వామపక్ష నాయకులు

శనివారం ప్రచార భేరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బచ్చల సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో మోడి ప్రభుత్వం అధికారానికి వచ్చిన తరువాత దేశ ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.క్రిష్ణ, ఆదిలక్ష్మి. రాజమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : మండలంలోని పేరాపురంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు బి.సూర్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు తాలాడ బుజ్జిబాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

జామి : మోడీ మతోన్మాద పాలనకు చరమగీతం పాడాలని సిపిఎం నాయకులు మద్దిల రమణ, సిపిఐ నాయకులు మద్ది కృష్ణ కోరారు. శనివారం జామి మండల కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యాన ప్రచారభేరి నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.భీముడు, డి.అప్పలరాజు, మోపాడ మధు పాల్గొన్నారు.

జామి.. ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు ; బాడంగి.. ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శంకరరావు

విజయనగరం : జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా రంజాన్

ప్రజాశక్తి-విజయనగరం కోట, బొబ్బిలి, లక్కవరపుకోట

రంజాన్ వేడుకలు శనివారం జిల్లా అంతటా ఘనంగా జరిగాయి. ముస్లిములంతా మసీదులకు చేరుకొని ప్రత్యేక నమాజ్ చేశారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కులమతాలకు అతీతంగా రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. దేశాభివృద్ధి, మత సామరస్యం పెంపొందించాలని మత పెద్దలు తెలిపారు. విజయనగరంలోని తోటిపాలెం రోడ్డులో గల ఈద్గా మసీదులో 12 మసీదులకు చెందిన ముస్లిములు పాల్గొని నమాజ్ చేశారు. బొబ్బిలిలో రంజాన్ ప్రాముఖ్యతను ముస్లిం పెద్ద అబ్దుల్ కలాం వివరించారు. లక్కవరపుకోటలోని మక్కా మసీదులో రంజాన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇమామ్ షేక్ అబ్దుల్ రెహమాన్, మక్కా మసీదు అధ్యక్షులు దర్గామదీనా, ప్రధాన కార్యదర్శి షేక్ మదీనా, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాసిం పాల్గొన్నారు.

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

శృంగవరపుకోట : పట్టణంలోని బర్మా కాలనీ వద్దనున్న ఈద్గాలో ముస్లిం సోదరులు నిర్వహించిన రంజాన్ వేడుకలలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత గురువు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, పట్టణ అధ్యక్షులు షేక్ రెహమాన్, వైసిపి నాయకులు బషీర్, పి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్‌పై పోరాటం

ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మన్యం జిల్లాలో విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సస్పెండ్ చేయడాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఖండించింది. ఈ చర్యలను నిరసిస్తూ పోరాట కార్యక్రమాలు చేపట్టాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. శనివారం ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు టి.సన్యాసిరాజు అధ్యక్షతన సభ్య సంఘాల సమావేశం ఎపి ఎన్‌జిఒ హోంలో నిర్వహించారు. ప్రవీణ్ ప్రకాష్ ఉద్దేశపూర్వకంగానే మన్యం జిల్లా డిఇఒ రమణను, వీరఘట్టం ఎంఇఒ కృష్ణమూర్తిని, ఎజి సిడిఒ రోజా రమణిని, కెజిబివి ఇన్చార్జ్ స్పెషల్ ఆఫీసర్ రోహిణి ని అన్యాయంగా సస్పెండ్ చేశారని అన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. అక్రమ సస్పెన్షన్‌లకు వ్యతిరేకంగా ఆదివారం ఉపాధ్యాయులంతా నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని, 10వ తరగతి స్పాట్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులంతా నల్ల బ్యాడ్జీలు ధరించాలని తీర్మానం చేశారు. స్పాట్ కేంద్రంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలపాలని నిర్ణయించారు. సమావేశంలో టి.సన్యాసిరాజు (ప్రధానోపాధ్యాయుల సంఘం), డి.రాము (యుటిఎఫ్), డి.ఈశ్వరరావు (ఎపిటిఎఫ్ 1938), పి.శ్రీనివాస్ (ఎపిటిఎఫ్ 257) డి.శ్యామ్, వై.అప్పారావు (ఎస్‌టియు), వి.రవీంద్రనాయుడు (పిఆర్ టియు), బి.గోవింద నాయుడు (ఆర్‌యుపిపి), ఎస్‌వి శ్రీకాంత్ (బి టిఎ), ఇ.రామనాయుడు

అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు

(ఆపస్), అమర్నాథ్ (ఎటిఎ), రాము (ఎపిటిఎ), సన్యాసినాయుడు (పిఇటి అసోసియేషన్) పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాన్ని ఉద్యోగులపై నెట్టడం సరికాదు

ప్రభుత్వ వైఫల్యాన్ని ఉద్యోగులపైకి నెట్టి అధికారులను, ఉపాధ్యాయులను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సస్పెండ్ చేయడం సరికాదని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఫెడరేషన్ జెఎసి అధ్యక్ష కార్యదర్శులు బాలకాశి, కాంతారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదని, ఏ స్కూల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు ఎన్ని పుస్తకాలు అందించాలని పుస్తకాల డిస్ట్రిబ్యూట్ చేసే యాజమాన్యం వేరేగా ఉందని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం కెజిబివి ఇన్చార్జి ప్రిన్సిపాల్ మండల స్థాయి అధికారి దృష్టికి తీసుకెళ్లినా 8వ తరగతి విద్యార్థులకు సరిపడే ఇంగ్లీష్ మీడియం మ్యాథమెటిక్స్ పుస్తకాలు రాకపోతే ఆ తప్పును స్కూల్ ప్రిన్సిపాల్ మీదకు నెట్టి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. సస్పెన్షన్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిఇఒ, జిసిడిఒ, వీరఘట్టం ఎంఇఒ, కెజిబివి స్కూల్ ప్రిన్సిపాల్ సస్పెండ్ చేయడాన్ని ఖండించారు.

చేను చెల్లుపోయాక కళ్లం కాపు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'చేను చెల్లిపోయాక కళ్లం కాపు' అంటే ఇదేనేమో... లేకపోతే ఇందేంటండి బాబు.... మరో వారం రోజుల్లో బడులకు వేసవి సెలవులు రానున్నాయి. ఇప్పటికే పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. ఈ సమయంలో పుస్తకాల గొడవేంటిరా బాబు' ఇదీ విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో పబ్లిక్ టాక్. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవడం తప్పుకాదు. కానీ, ఈ పని ఎప్పుడో చేయాల్సివుంది... ఇంత ఆలస్యంగా స్పందించడం మాత్రం తప్పుకాదా? అంటూ మరికొందరు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పార్వతీపురం మన్యం జిల్లాలో గురు, శుక్రవారాల్లో పర్యటించిన విషయం విధితమే. రాత్రి వరకు ఆకస్మిక తనిఖీలు చేయడంతో అధికారులు పరుగులు తీశారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లిమరీ లోపాలను ఎత్తిచూపారు. వాటి పరిష్కారానికి అధికారులు, సిబ్బందికి ఎన్నో సూచనలు, ఆదేశాలు చేశారు. ఇంత వరకు బాగానేవున్నా వీరఘట్టం మండలం రేగులపాడు కెజిబివికి పుస్తకాలు అందకపోవడం పట్ల డిఇఒ, ఎంఇఒ, అసిస్టెంట్ గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, కెజిబివి ప్రిన్సిపాల్ లను సస్పెండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం తప్పు కాదని, పుస్తకాల పంపిణీలో జాప్యానికి కేవలం అధికారులనే బాధ్యులు చేయడం బాధాకరణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందుకు బలమైన కారణాలనే ఎత్తిచూపుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 3384 ప్రభుత్వ స్కూళ్లు, దాదాపు 800 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ స్కూళ్లలో 2,31,137మంది, ప్రైవేటు స్కూళ్లలో 80వేల మంది ఉన్నట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీరిలో 9,10 తరగతులకు 9రకాలు, 8వ తరగతికి 8రకాలు, 6,7 తరగతులకు 6రకాలు, 3,4,5 తరగతులకు 4నుంచి 5రకాలు, 1, 2 తరగతులకు 2రకాల చొప్పున 25లక్షలకుపైగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాల్సివుంది. కానీ, జులై 15వ తేదీ వరకు ఈ రెండు జిల్లాల్లో కేవలం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 14,31,141 పుస్తకాలు పంపిణీ చేశారు. ఇందులోనూ 6వ తరగతి విద్యార్థులకు ఆరు రకాల పుస్తకాలు పంపిణీ చేయాల్సివుండగా దాదాపు అన్ని స్కూళ్లకూ మూడు రకాల పుస్తకాలు మాత్రమే అందాయి. అప్పటికి కొన్ని స్కూళ్లకు తెలుగు, సైన్స్, ఇంగ్లీషు మాత్రమే ఇచ్చారు. మిగిలిన స్కూళ్లకు లెక్కలు, హిందీ, సోషల్ పుస్తకాలను సర్థుబాటు చేశారు. పుస్తకాల కొరతను తెలియనివ్వకుండా ఇలా సర్థుబాటు చేసిన విషయం అప్పట్లో ఉపాధ్యాయులు గుర్తించారు. అరకొరగా వచ్చిన పుస్తకాలు ఎవరికి పంచాలో అర్థం కాక ఉపాధ్యాయులు అప్పట్లో తలలు పట్టుకున్నారు. ఇంకోవైపు సకాలంలో పుస్తకాలు అందజేయకపోతే పాఠ్యాంశాలు ఎలా బోధిస్తామని, సంవత్సరాంతంలో ఫలితాలు తగ్గితే వేధింపులకు గురిచేస్తారని ఉపాధ్యాయులు వారిలో వారే గుసగుసలాడుకునే పరిస్థితి కనిపించింది. దీంతో, అప్పట్లో ప్రభుత్వ తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపించాయి.

నూతన విద్యావిధానంలో భాగంగా ఉన్నత పాఠశాలలకు మూడు కిలోమీటర్లలోపుగల ప్రాథమిక పాఠశాలను విలీనం పేరిట మూసివేసేందుకు చూపిన శ్రద్ధ పాఠ్యపుస్తకాల ముద్రనపై ప్రభుత్వమే అప్పట్లో శ్రద్ధ చూపలేదు. దీనికితోడు కొన్ని ముద్రణా సంస్థలపై అమితమైన ప్రేమ కనబరుస్తూ ఎక్కువ ఆర్డర్లు ఇవ్వడం వల్ల సకాలంలో ప్రింటింగ్ కాలేదు. చివరికి పాఠ్యపుస్తకాల ప్రచురణలోనూ సర్కారు వ్యాపార ధోరణి అవలంభించడంతో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు 100శాతం పుస్తకాలు అందరికీ అందిపోయినట్టు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి బయోమెట్రిక్ తీసుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేశారు. మరికొన్ని చోట్ల నేరుగా సచివాలయాల్లోని బయోమెట్రిక్ మిషన్లు పట్టుకుని ఏకంగా వాలంటీర్లు రంగంలోకి దిగారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అన్నట్టుగా ప్రభుత్వమే పుస్తకాలన్నీ ఇచ్చేసినట్టు లెక్కలు చూపించమని ఒత్తిడి చేయంతో ఆ తరువాత వచ్చిన పుస్తకాలు మూలనపడేసి ఉండవచ్చు. ఆలస్యంగా వచ్చిన పుస్తకాలు పాఠశాలలకు వెళ్లాయా? లేదా? అన్నది కూడా బహుశా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కూడా ఆలస్యంగానే పరిశీలించారు. రాజు తలచుకుంటే కొరడా దెబ్బలే కరువా? అన్నట్టు ఎంతైనా ముఖ్యకార్యదర్శి కాబట్టి డిఇఒ సహా నలుగుర్ని సస్పెడ్ చేశారు. ఇప్పటికైనా చేను చెల్లిపోయాక కళ్లం కాపు మాదిరిగా పాఠశాల మూసివేత దశలో కాకుండా ప్రారంభంలోనే పుస్తకాలు వెళ్లాయా? లేదా? అనేది చూసుకుంటే మంచిదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఇదేం ఖర్మ కార్యక్రమం లో పాల్గొన్న సంధ్యారాణి

వైసిపి పాలనలో అరాచకమే

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి- మెంటాడ

వైసిపి పాలనలో అంతా అరాచకమేనని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం మండలంలోని పెద చామలాపల్లి నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపుకోసం జగన్ రెడ్డి పూర్తిగా హత్యా రాజకీయాలనే నమ్ముకొని, ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్నారని దుయ్యబట్టారు. 'నువ్వే మా నమ్మకం జగన్' కార్యక్రమాన్ని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారని చెప్పారు. ప్రశ్నించే గొంతులపై అక్రమకేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విరుచుకుపడ్డారు. జగన్ పాలనకు కౌంట్ డౌన్ ప్రారంభమైందని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు చనుమూరి వెంకటరావు, గెద్ద అన్నవరం, రెడ్డి ఎర్నానాయుడు, బాయి భాస్కరరావు, బాయి వెంకటరావు, బుత్తల గౌరినాయుడు, హరి ఈశ్వరరావుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రశాంత వాతావరణంలో గ్రామదేవత పండుగలు నిర్వహించాలని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు ఉత్సవ, గ్రామ కమిటీలను కోరారు. పోలీస్ స్టేషన్లో మల్లంపేట, ఎం.బూర్జవలస గ్రామ, ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 24,25,26 తేదీల్లో జరగనున్న గ్రామదేవత పండగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. అశ్లీల నృత్యాలు, డిజెలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. పండుగలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

వేపాడ : వల్లంపూడి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి తెలిపారు. ఇటీవల వల్లంపూడి గ్రామంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పర్యటన సందర్భంగా గ్రామస్తులు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చైర్మన్ ఆదేశాలతో శనివారం ఆ గ్రామంలో జెఇ పర్యటించారు. తాగునీటి సమస్య ఉన్న చోట అదనపు కొళాయి పాయింట్లు ఏర్పాటు చేస్తామని ఆమె గ్రామస్తులకు తెలిపారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై గ్రామసభ

వేపాడ : మండలంలోని సింగరాయిలో సర్పంచ్ నిరుజోగి వెంకటరావు ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారీపై గ్రామసభను ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ ఎం.రామలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో కార్యాచరణను వివరించారు. నవధాన్యాల సాగు వల్ల ప్రయోజనాలను వివరించారు.కార్యక్రమంలో విఎఎ సత్యవతి, ఐసిఆర్‌పి వై.సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

2న నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా మహాసభ

విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘం విజయనగరం జిల్లా మహాసభ వచ్చేనెల 2న జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి దుర్గారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం అంబేద్కర్ జంక్షన్ లోని ప్రజా గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ మహాసభకు జిల్లా లోని నాయీ బ్రాహ్మణులంత హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రిమ్మనపూడి సురేష్, తమిరి సత్యనారాయణ, ఆలమూరు అప్పారావు, పట్నాన సిమ్మయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బొబ్బిలి : బొబ్బిలి పాస్టర్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాజా కళాశాల రోడ్డులో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఈ చలివేంద్రాన్ని డిఎస్‌పి బి.మోహనరావు, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్ నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పొట్నూరు కిరణ్ కుమార్, బిపిఎఫ్ఎ ప్రెసిడెంట్ సిహెచ్ జయరాజ్ దంపతులు, సెక్రెటరీ జాన్ బాబు, వైస్ ప్రెసిడెంట్ బి.గోపాలరావు, ట్రెజరర్ పిటి నాయుడు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

ఘనంగా ధరిత్రీ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి అని, అలాంటి భూ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కోసం ఎపి నేషనల్ గ్రీన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం కస్పా హైస్కూల్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి, జిల్లా ఉపవిద్యా శాఖాధికారులు కె.వాసు దేవరావు, డాక్టర్ ఎన్. తిరుపతి నాయుడు, డిసిఇబి సెక్రటరీ టి.సన్యాసిరాజు, డిఎస్ఒ డాక్టర్ ఎం కృష్ణారావు, జిల్లా ఎన్‌జిసి కోఆర్డినేటర్ బి.వేణుగోపాలరావు పాల్గొన్నారు. భూ పరిరక్షణ కోసం చర్యలు తీసుకోకపోయినా పరవాలేదు కానీ హాని కలిగించే చర్యలు తీసుకో కూడదని విద్యార్థులు నినాదాలు చేశారు.

పక్షులకు నీరు పెట్టండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎండల తీవ్రత దృష్ట్యా తమ ఇళ్ల మేడలపైనా, ప్రహరీలపైనా పక్షులు తాగేందుకు గిన్నెలతో నీరు పెట్టాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజి పిలుపునిచ్చారు. స్థానిక బొబ్బాదిపేట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద జెవివి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణాజి మాట్లాడుతూ ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున మనుషులతో పాటు పశుపక్షాదులు కూడా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎరుకొండ ఆనంద్, శాంత కుమారులు మాట్లాడుతూ ఈ చలివేంద్రాన్ని సుమారు 50 రోజులపాటు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పట్టణ అధ్యక్షుడు షినగం శివాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాంస్కృతిక వేదిక రాష్ట్ర కన్వీనర్ గంద్రేటి శ్రీను అలియాస్ డప్పు శ్రీను, పట్టణ ప్రధాన కార్యదర్శి పి. షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందిస్తున్న షణ్ముఖరావు

ఇంకా మంచి చేస్తాం..

గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-లక్కవరపుకోట

వైసిపి హయాంలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ఇంకా మంచి చేస్తామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారానికి 181వ రోజుకు చేరుకుంది. శనివారం లక్కవరపుకోట మండలంలోని రేగ గ్రామ సచివాలయ పరిధిలో పెదిరెడ్లపాలెంలో ఆయన గడపగడపకూ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, జెసిఎస్ మండల కన్వీనర్ యడ్ల కిశోర్, సర్పంచ్ రావాడ నీలకంఠం, ఎంపిటిసి బొడ్డు గణపతి, వైసిపి నాయకులు జగ్గన్న దొర పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై వృద్ధుడ్ని ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

లక్కవరపుకోట : కరపత్రాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

గడపగడపకూ కోలగట్ల

విజయనగరం టౌన్ : నగరంలోని 21వ డివిజన్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పింఛను, అమ్మ ఒడి, ఆసరా, వసతి దీవెన, చేయూత వంటి అనేక పథకాలను అందిస్తున్న తీరు ఎలా ఉందని అడిగారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఇంట ప్రభుత్వ పథకాలు అందడంతో సంతోషం వ్యక్తమౌతుందని అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రభుత్వ పథకాల అమలు తీరును ఆరాతీస్తూనే స్థానిక సమస్యలు ఉంటే చెప్పాలని కోరడం హర్షదాయకమన్నారు.కార్యక్రమంలో వైసిపి డివిజన్ అధ్యక్షుడు కనకల గిరి, స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లి, రాష్ట్ర పరిశ్రమల అభివద్ధి మండల డైరెక్టర్ బంగారు నాయుడు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, జోనల్ ఇన్చార్జి కాళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యమా.? రౌడీ రాజ్యమా?

ప్రజాశక్తి- గరివిడి

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రౌడీలు రాజ్యమేలుతున్నారని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో చంద్రబాబు నాయుడు పర్యటనలో ఆ జిల్లాకు చెందిన మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో రాళ్ల దాడి చేయించడం దారుణమన్నారు. చంద్రబాబుకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి వైసిపి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకు తీవ్ర అసంతృప్తి పెరిగిపోవడంతో ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ చొక్కా విప్పి సవాల్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆయన మంత్రిలా కాకుండా రౌడీలా వ్యవహరించారన్నారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడికే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ప్రజలందరూ జగన్మోహన్ రెడ్డి గో బ్యాక్ అనే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు రౌతు కాము నాయుడు, పైల బలరాం, దన్నాన రామ చంద్రుడు, సారేపాక సురేష్ బాబు, మహంతి రమణ మూర్తి, మహంతి అప్పల నాయుడు, శనపతి శ్రీను, గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-కొత్తవలస

నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. కొత్తవలస మండలంలో తుమ్మికాపల్లి ఫ్లైఓవర్ వద్ద ఆమె సెల్ఫీ తీసుకుని ఎమ్మెల్యేకు ఛాలెంజ్ చేశారు. కొత్తవలస నుంచి దేవరాపల్లి రోడ్డులో తుమ్మికాపల్లి వద్ద రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణాన్ని టిడిపి హయాంలో చేపట్టినట్లు వివరించారు. గడిచిన నాలుగేళ్లలో ఇటువంటి ప్రజల ప్రయోజనాల కోసం శాశ్వత నిర్మాణాలను నియోజకవర్గంలోని ఎక్కడైనా? చేపట్టారా? అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

కార్యకర్త కుటుంబానికి కోళ్ల పరామర్శ

మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంచి మనసు చాటుకున్నారు. మరణించిన సీనియర్ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచారు. పిల్లల చదువు బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చారు. కొత్తవలస మండలం వీరభద్రపురం పంచాయతీ కర్రిచిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కర్రి సత్యనారాయణ ఇటీవల మరణించారు. ఆయనకు భార్య కర్రి లక్ష్మి, కుమార్తె ప్రియాంక, కుమారుడు శ్యామ్ ఉన్నారు. శనివారం ఆ కుటుంబాన్ని మాజీ

మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆ కుటుంబానికి రూ.35 వేలు ఆర్థిక సాయం చేశారు. అంతేకాకుండా ఇద్దరు పిల్లలను పదో తరగతి పూర్తయ్యేంత వరకూ చదివించేందుకు కోళ్ల లలితకుమారి దంపతులు వారిని దత్తత తీసుకున్నారు. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా కార్యకర్తలకు అండగా నిలుస్తామని హామీనిచ్చారు.

కార్యక్రమంలో టిడిపి సీనియర్ బొబ్బిలి అప్పారావు, కోళ్ల వెంకటరమణ, తిక్కాన చిన దేముడు, మండల ప్రధాన కార్యదర్శి కనకాల శివ, నాయకులు బంగారు రమేష్, పొట్నూరు వెంకట రత్నాజి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగానికి సహకారమందించాలి

డిసిఎంఎస్ చైర్‌పర్సన్ భావన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోన్న రోటరీ క్లబ్ ద్వారా భవిష్యత్‌లో వ్యవసాయరంగానికి కూడా సహకారం అందించా లని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన ఆకాంక్షించారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం రోటరీ క్లబ్ నిర్వహించిన 'నేటి జీవనశైలికి రైతుల జీవితాలు.. వారి అభ్యున్నతిలో డిసిఎంఎస్ సహకారం'.. నేటి జీవనశైలి కోసం దంతవైద్యం' అనే అంశాలపై మాట్లాడారు. డిసిఎంఎస్ ఆధ్వర్యాన మహిళలకు టెక్స్ టైల్ రంగంలో శిక్షణ, ఖరీఫ్ సీజన్ లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందించడం, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వంటి ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. నేడు డిసిఎమ్ఎస్ ద్వారా రైతులు పండిస్తున్న ఉత్పత్తులను ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు, పైడితల్లి, పోలమాంబ అమ్మవార్ల దేవస్థాన అన్నదాన సత్రాలకు, అంగన్వాడీలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇలా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ డిసిఎమ్ఎస్ ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. రోటరీ సభ్యులు కూడా వ్యవసాయరంగం వైపు అడుగులు వేయాలని కోరారు. అంతేకాకుండా ఇటీవల కాలంలో ప్రతి ఒక్కరిలో దంతాల సమస్య ఎక్కువగా కనిపిస్తోందని, దంతాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విజయనగరం అధ్యక్షులు కృష్ణగోపాల్ అగర్వాల్ , కార్యదర్శి సాయి మనోజ్ , క్లబ్ సర్వీసెస్ డైరెక్టర్ శంకర్ రెడ్డి , క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం చాటుకుంటున్న 'ధీరా'

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి రుంకాన వీధిలో అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుని ధీరా సంస్థ తన సేవా దృక్పదాన్ని చాటుకుంది. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పురిల్లు దగ్ధంమైన విషయం తెలిసిందే. ఈ బాధితులకు శనివారం ధీరా స్వచ్ఛంద సంస్థ తరుపున మాజీ ఎంపి బొత్స ఝాన్సీ లక్ష్మి ఒకొక్క కుటుంబానికి రూ. 5వేల చొప్పున ఆర్థిక సాయం అందించి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు కూడా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధీరా సంస్థ ద్వారా బాధితులకు తోడుగా ఉంటామన్నారు. బాధితులకు ఇల్లు కట్టి ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, గరివిడి జెడ్‌పిటిసి వాకాడ శ్రీను, మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, దన్నాన జనార్ధన్, ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి, యువనాయకుడు బెల్లాన వంశీ కృష్ణ, మంగళగిరి శ్రీను, ఎంపిటిసి గెరిడి రామదాసు, ముళ్ళు పైడిరాజు, కోరుకొండ దాలయ్య, సతివాడ అప్పారావు, కరణపు అది, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

గరివిడి మండలంలోని శివరాం గ్రామ సర్పంచ్ గవిడి శ్రీధర్ బాబు తల్లి మాజీ సర్పంచ్ గవిడి సరస్వతమ్మ శుక్రవారం శివరాంలో అనారోగ్యంతో మృతి చెందారు. అది తెలుసుకున్న మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం సరస్వతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ మీసాల విశ్వేశ్వరావు. జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపి ఝాన్సీలక్ష్మి

'సీతం'లో ప్రపంచ పుస్తక దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ సహాయక గ్రంథాలయ అధికారి డాక్టర్ డి.నారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఆయన మాట్లాడుతూ 'ఒక మంచి పుస్తకం- ఒక మంచి స్నేహితుడు' అనే నానుడి ప్రకారం ప్రతి ఒక్కరూ మంచి పుస్తకాలను చదవడం ఒక దినచర్యగా అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఒక మంచి పుస్తకాన్ని చదవడం ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకుంటూ కొంగ్రొత్త అనుభవాలను సంతరించుకొంటూ వారి జీవితంలో వాటిని ఇనుమడింప చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.డి.వి.రామమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండడంలో మంచి పుస్తకాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్.వెంకటలక్ష్మి, కళాశాల గ్రంథాలయ అధికారిణి డాక్టర్ లెంక సత్యవతి ఆధ్వర్యంలో విద్యార్థులలో ఉన్న పుస్తక ప్రతిభను మరియు జనరల్ నాలెడ్జ్ ను వెలికి తీసేందుకు "కహూత్ క్విజ్ "మరియు "నేను బాగా ఇష్టపడే పుస్తకం" అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు కళాశాల డైరెక్టర్ డాక్టర్. మజ్జి.శశిభూషణరావు మరియు కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి తమ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు,గ్రంథాలయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, సిబ్బంది

ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - జామి

మండలంలోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజినిగిరి, తానవరం గ్రామాల నుంచి పెద్దఎత్తున జనం తరలి వచ్చారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, హెల్పింగ్ హ్యాండ్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

68 మందికి వైద్య పరీక్షలు

శృంగవరపుకోట : మండలంలోని రేగ పుణ్యగిరి గ్రామంలో కొట్టాం పిహెచ్‌సి ఆధ్వర్యాన శనివారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 68 మంది గిరిజనులకు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శంకరరావు, ఎంపిహెచ్ఎస్ఎం పి.శ్రీనివాసరావు, ఎంఎల్‌పిహెచ్ సుశీల, ఆశా వర్కర్ శ్రావణి, వాలంటీర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-బొబ్బిలి

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడటం అత్యున్నతమైన సామాజిక సేవ, బాధ్యతని బొబ్బిలి డిఎస్‌పి బి.మోహనరావు తెలిపారు. శనివారం స్థానిక ఎస్ఇబి స్టేషన్ ప్రాంగణంలో బొబ్బిలి రోటరీ క్లబ్, ఎస్ఇబి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలిలో రోటరీ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఎస్ఇబి సహకారాన్ని తీసుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరమని అన్నారు. రక్తదానం చేసే వారిని ఆయన అభినందించారు. బొబ్బిలి బ్లడ్ బ్యాంక్ సహకారంతో 48 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన వారికి అనంతరం ఎస్ఇబి సిఐ జైబీమ్, రోటరీ అధ్యక్షులు జెసి రాజు.. వివిధ పండ్లతో కూడిన ఫ్రూట్స్ బాస్కెట్‌ను అందించారు. కార్యక్రమంలో ఎస్ఇబి ఎస్ఐ చిన్నం నాయుడు, డాక్టర్ దివాకర్ బాబు, రోటరీ సర్వీస్ ప్రాజెక్టు చైర్ గెంబలి శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీ హరి, జి.శంకరరావు, కిరణ్ కుమార్, బొబ్బిలి బ్లడ్ బ్యాంకు మేనేజర్ పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదాతను అభినందిస్తున్న డిఎస్‌పి

ఎమ్మెల్యే బడ్డుకొండకు సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి- డెంకాడ

డెంకాడ ఆనకట్ట ప్రధాన కాలువ సుమారు 5,350 ఎకరాలకు 3 మండలాల్లో రైతులకు ప్రధాన నీటి పారుదల కాలువని ఈ కాలువను బాగు చేయాలని డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ మేరకు శనివారం ఆయకట్టును టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చి 4సంత్సరాలు అయినప్పటికి తట్ట మట్టి కూడా తీయలేదన్నారు. బలిచిన పిచ్చి మొక్కలు కూడ తొలగించకుండా పెంచారని ఎద్దేవా చేశారు. క్లీన్ అండ్ గ్రీన్ అంటె ఇదేనేమో? నని విమర్శించారు. రైతు మీద ప్రేమ ఉంటే ఆయకట్టును బాగుచేయాలని చెప్పారు.

నేరాలు ఘోరాలు

బస్సు, ఆటో ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని దొడ్డిబాడువ వద్ద శనివారం ఆర్‌టిసి బస్సు ఆటో ఢీకొని ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం విజయనగరం జిల్లా ధర్మపురికి చెందిన బట్టాన ఆదినారాయణ విజయనగరం నుంచి నాతవలస వైపు తన ఆటోలో ప్రయాణికులకు తీసుకుని వెళుతుండగా దొడ్డి బాడువ వద్ద అదే రహదారిలో విజయనగరం నుంచి శ్రీకాకుళం వెళుతున్న ఆర్‌టిసి హయ్యర్ బస్సు వెనుక నుంచి ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో ఫల్టీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతనికి కుడి చేయి విరిగిపోయింది. ఈ ప్రమాదం జరగడంతో విజయనగరం నాతవలస రహదారిలో అరగంట పాటు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు. క్షతగాత్రులను 108 ద్వారా విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదమ్ముల మధ్య కొట్లాట

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి ఆమదాలవలస మండలం మునకలవలసలో శాసపు తవిటినాయుడు , అతని తమ్ముడు శాసపు రమణ కుటుంబాల మధ్య శనివారం సాయంత్రం జరిగిన గొడవలో పలువురికి గాయాలయ్యాయి. వీరి మధ్య గత రెండేళ్లగా వారి ఇంటి ముందు ఉన్న 28 సెంట్ల ఖాళీ స్థలం కోసం గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కల్లంలో శాసపు రమణ గడ్డి కుప్పలు వేస్తుండగా, శాసపు తవిటినాయుడు కుటుంబ సబ్యులు అడ్డు తగిలారు. దీంతో ఇరువురి మధ్య మాట మాట పెరిగి కొట్లాటకు దారితీసింది. దీంతో ఇరు కుటుంబాలకు చెందిన వారు గాయపడ్డారు. వీరంతా రాజాం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఇరు కుటుంబాలపైనా కేసు నమోదు చేశారు.